

సాక్షి
అనంతపురం

రేపటికి ముందడుగు



శుక్రవారం ¦ 8 ¦ మార్చి ¦ 2024

న్యూస్‌రీల్

ఆనందమానందమాయె



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం మెడికల్: 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడంపై ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఓ గిరిజా మనోహర్ రావుకు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘం సభ్యులు శివకుమార్, హరికృష్ణ, రాఘవేంద్ర, కిరణ్, ప్రసాద్, ముకుందర్, రవీంద్ర, పాల్గొన్నారు.

- ప్రభుత్వ నిర్ణయంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలుపుకున్నారన్నారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు



అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎం.గౌతమి మహాశివ రాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. పరమశివుని కృపాకటాక్షాలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనంద మయ జీవితం గడపాలని ఆకాంక్షించారు.

ఏపీఎంఐపీ పీడీగా రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) జిల్లా పీడీగా బి.రఘునాథరెడ్డి గురువారం స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ అధికారి (డీడీహెచ్)గా పనిచేస్తున్న రఘునాథరెడ్డికి పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. దీంతో ఖాళీ అయిన డీడీహెచ్ పోస్టులో కమిషనరేట్‌లో పని చేస్తున్న అండాళ్‌ను నియమించారు. ఆమె కూడా స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. అయితే, బాధ్యతలు చేపట్టిన వెంటనే తిరిగి డెప్యుటేషన్‌పై కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లారు. దీంతో ఆ స్థానంలో ఉద్యానశాఖ ఏడీ బీఎంవీ నరసింహారావు ఇన్‌చార్జ్ డీడీహెచ్‌గా బాధ్యతలు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. శింగనమల నియోజకవర్గ పరిశీలకుడిగా టీఈసీ రమేష్‌రెడ్డి, రాప్తాడు నియోజకవర్గ పరిశీలకుడిగా టీజీ సురేష్‌ను నియమించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

అనంతపురం రూరల్: వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధుసూదన్‌రావు వార్డెన్లను ఆదేశించారు. గురువారం స్థానిక దామోదర సంజీవయ్య భవనంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారులు దామోదర్‌రెడ్డి, రామ్మోహన్, ఫక్కీరయ్య తదితరులున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం గణితం–2ఏ, బాటనీ–2, సివిక్స్–2 పరీక్షలు జరిగాయి. మొత్తం 587 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 17,380 మంది జనరల్ విద్యార్థులకు గాను 16,841 మంది హాజరయ్యారు. 537 మంది గైర్హాజరయ్యారు. 1,271 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,221 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 5, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 10 పరీక్షా కేంద్రాలను పరిశీలించాయి. నాలుగు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు.

అక్కచెల్లెమ్మలకు అండదలం



- మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- అన్నింటా అగ్రస్థానం కల్పించి ఆర్థిక స్వాతంత్య్రం
- పొదుపు సంఘాల మహిళలకు ఉచితంగా రూ. కోట్ల లబ్ధి
- చంద్రబాబు మోసంతో దగాపడిన సంఘాలకు పునరుజ్జీవం
- గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ పరంగానూ అండ
- 50 శాతం నామినేటెడ్ పదవులతో పాటు నామినేషన్ పనులూ వారికే

అనంతపురం: చంద్రబాబు నమ్మించి మోసం చేస్తే సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. అన్నింటా పెద్దపీట వేసి అక్కచెల్లెమ్మలను అందలం ఎక్కించారు. మాట నిలబెట్టుకుని మహారాణులను చేశారు. ప్రతి మహిళనూ సాధికారతకు ప్రతినిధిగా తీర్చిదిద్దారు. అంతులేని ఆత్మవిశ్వాసాన్ని నింపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

దేశానికే ఆదర్శంగా విప్లవాత్మక సంస్కరణలు

సీఎంగా బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచే మహిళా సాధికారతే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. చంద్రబాబు హయాంలో దగా పడిన డ్వాక్రా మహిళలకు అండగా నిలిచారు. 'వైఎస్సార్ ఆసరా' పథకం ప్రవేశపెట్టి జిల్లాలో 24,113 మహిళా సంఘాలకు గాను బ్యాంకుల్లో అప్పుగా ఉన్న రూ.551.03 కోట్లను తిరిగి అక్కచెల్లెమ్మలకే అందించారు. మరో వైపు 45–60 ఏళ్ల మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ. 75 వేల లబ్ధి చేకూర్చారు. ఇప్పటిదాకా నాలుగు విడతల్లో రూ.829 కోట్లు చెల్లించారు. బ్యాంకు లింకేజీ కార్యక్రమం ద్వారా 27,377 సంఘాలకు రూ.3,758.71 కోట్లు పంపిణీ చేశారు. రుణాలపై వడ్డీని తిరిగి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుండడం గమనార్హం. దీంతో పాటు 'సున్నా వడ్డీ' పథకం కింద 32,441 మహిళా సంఘాలకు రూ. 202.99 కోట్లు చెల్లించారు. చంద్రబాబు నిర్వాకంతో నిరర్థక ఆస్తులుగా మారిన 18.36 శాతం సంఘాలకు పునరుజ్జీవం పోశారు. పకడ్బందీ చర్యలు చేపట్టి కేవలం 0.73 శాతానికి పరిమితయ్యేలా చేశారు.

పిల్లల చదువులకు ఆర్థిక సాయం..

తమ పిల్లల్ని చదివిస్తున్న తల్లులకు రూ.15 వేలు ఇచ్చే 'జగనన్న అమ్మ ఒడి' పథకాన్ని సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యాభివృద్ధి జరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా 'జగనన్న వసతి' దీవెన కింద నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. 'వైఎస్సార్ కాపు నేస్తం' పథకం ద్వారా ఏటా రూ.15 వేల చొప్పున అందించి చేయూతనిచ్చారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసు మధ్యలో ఉండి, ఏ పథకం అందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు వరుసగా 4 ఏళ్లలో రూ.75 వేలు అందించేందుకు 'వైఎస్సార్ చేయూత' పథకం తీసుకొచ్చారు. కేవలం డబ్బు ఇవ్వడమే కాకుండా బ్యాంకులు, వివిధ కార్పొరేట్ సంస్థలతోనూ మాట్లాడి వారికి వ్యాపార అవకాశాలు చూపారు. ఆవులు, గేదెలు కొనుక్కొని అమూల్ సంస్థ ద్వారా గిట్టుబాటు వ్యాపారం జరిగేలా చర్యలు తీసుకున్నారు. సీఎం జగన్ విజ్ఞప్తితో రిలయన్స్, ఐటీసీ వంటి సంస్థలు వారికి తోడుగా నిలుస్తున్నాయి.

అన్నింటా అగ్రస్థానం..

- ఇల్లు లేని ప్రతి నిరుపేదకు, అది కూడా అక్కచెల్లెమ్మల పేరుతో ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా, జిల్లాలో 92 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల స్థిరాస్తి కల్పించారు.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద గర్భిణులు, బాలింతలకు మంచి ఆహారాన్ని అందిస్తున్నారు. దీంతో జిల్లాలో 1.3 లక్షల మంది మహిళలకు మేలు కలుగుతోంది. ఈ పథకానికి రూ.150 కోట్లు ఖర్చు చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు కూడా పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చారు.
- మహిళల రక్షణ కోసం దేశానికే ఆదర్శంగా 'దిశ' బిల్లుకు రూపకల్పన చేశారు. ఇప్పటి వరకూ కొన్ని లక్షల మంది దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆపదలో ఉన్నప్పుడు యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కినా లేదా ఫోన్‌ను 5 సార్లు ఊపితే చాలు... నగరాల్లో అయితే 10 నిమిషాలు, గ్రామాల్లో 20 నిమిషాలు దాటకముందే పోలీసులు చేరుకుంటారు.
- ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలోనూ మహిళా పోలీసులను నియమించారు.
- రాజకీయ పరంగానూ మహిళలకు పెద్దపీట వేశారు. నామినేటెడ్ పదవుల్లో 51 శాతం వారికే కల్పించారు. నామినేషన్‌పై పనులూ కట్టబెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 202 మార్కెట్ యార్డ్ చైర్మన్లు ఉండగా, 102 చోట్ల మహిళలనే కొలువుదీర్చారు. 1,154 డైరెక్టర్ పదవుల్లో 586 మంది, జెడ్పీ చైర్మన్లు 13 మందిలో ఏడుగురు అక్కచెల్లెమ్మలే కావడం గమనార్హం. ఇదే కాకుండా, 75 మునిసిపాలిటీ చైర్మన్లలో 45 మంది, 26 జెడ్పీ వైస్ చైర్మన్ పదవుల్లో 15 మంది, 12 మేయర్ పోస్టులు, 24 డిప్యూటీ మేయర్ పదవులు, 361 మంది వార్డు మెంబర్లు మహిళలే ఉండేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ పదవుల్లో 57 శాతం, జెడ్పీటీసీల్లో 53 శాతం మహిళలే ఉన్నారు.
- సచివాలయాల్లోనూ 53 శాతం వలంటీర్లు మహిళలే. 1.30 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తుండగా, 51 శాతం మహిళా ఉద్యోగాలు ఉన్నారు. ఈ గణాంకాలు చాలు.. సీఎం వైఎస్ జగన్ ఎంతగా అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారో చెప్పడానికి.

సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక జిల్లాలో అక్కచెల్లెమ్మలకు చేకూరిన లబ్ధి ఇలా..

పథకం	మహిళల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్‌ఆసరా	24,11,330	734
వైఎస్సార్ సున్నా వడ్డీ	32,44,440	202.99
వైఎస్సార్ చేయూత	1,18,881	629.68
బ్యాంకు లింకేజీ	27,37,770	4,596
వైఎస్సార్ ఆసరా అర్బన్	68,797	212.86
వైఎస్సార్ సున్నా వడ్డీ అర్బన్	1,05,065	61
వైఎస్సార్ చేయూత అర్బన్	28,224	144.19
బ్యాంకు లింకేజీ అర్బన్	54,090	1679
జగనన్న అమ్మ ఒడి	3,81,559	1718
జగనన్న వసతి దీవెన	49,597	173
జగనన్న విద్యా దీవెన	50,702	393.47
వైఎస్సార్ కాపు నేస్తం	4,989	28

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మొదటి సారి నాకు రూ.18,750 వచ్చింది. నేను ఆవులు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నా. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటా. నా బిడ్డకు 'అమ్మఒడి' అందింది. ఇంటి స్థలం ఇచ్చారు. పేదలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– మాధవి, కొడిమి, అనంతపురం రూరల్

పథకాలతో భరోసా కల్పించారు



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాలుగు విడతల్లో లబ్ధి పొందా. రూ.18,750 చొప్పున రూ.75 వేలు అందుకున్నా. ఆ డబ్బుతో కిరాణా దుకాణం పెట్టుకుని ఉపాధి పొందుతున్నా. 'వైఎస్సార్ ఆసరా', 'సున్నావడ్డీ'తో కూడా ప్రభుత్వం ఆదుకుంది. నా భర్తకు పింఛను వస్తోంది. మహిళలకు ఈ ప్రభుత్వం ఎంతగానో భరోసా కల్పిస్తోంది.

– హన్నా, రుద్రంపేట, అనంతపురం రూరల్

ఇంతకంటే ఏం కావాలి..



ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో మాలాంటి పేదలు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. వైఎస్సార్ చేయూత కింద నాలుగు విడతల్లో రూ.75 వేలు అందుకున్నా. ప్రభుత్వ అందిస్తున్న సహకారంతో బియ్యం వ్యాపారం చేస్తూ నెలకు రూ.8 వేల వరకు సంపాదిస్తున్నా. 'వైఎస్సార్ ఆసరా', 'అమ్మ ఒడి'తో లబ్ధి పొందా. నా భర్తకు పింఛను వస్తోంది. ఇంతకంటే ఇంకేం కావాలి.

– ముంతాజ్, వికాస్‌నగర్, రుద్రంపేట, అనంతపురం రూరల్

ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్నపాటి పొరపాటుకూ తావివ్వకుండా పూర్తి చేయాలని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్, ఎంసీఎంసీ, మీడియాసెల్, సోషల్ మీడియా, సీ–విజిల్, వెబ్‌కాస్టింగ్, ఫిర్యాదు విభాగం తదితర వాటికి సంబంధించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కంట్రోల్ రూమ్ విధులకు సిబ్బందిని నియమించాలని చెప్పారు. కేటాయించిన బాధ్యతలపై స్పష్టతతో ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, సూచనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు ఉండాలని, ఇందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమీక్షలో డీపీఓ ఉమామహేశ్వరమ్మ, ఎస్‌ఐసీ డీఐఓ రవిశంకర్, డీసీఓ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు, ఉద్యానశాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐ పీడీ ఫిరోజ్‌ఖాన్, ఏపీజీఎల్ఐ డీడీ భాస్కర్, మత్స్యశాఖ డీడీ కృష్ణానాయక్,ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, సర్వేయర్ ప్రతాపరెడ్డి తదితరులున్నారు.

ప్రజలకు పోలీసుల భరోసా

అనంతపురం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించేలా భరోసా కల్పించేందుకు గురువారం తాడిపత్రి, ఉరవకొండ పట్టణాల్లో కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించరాదని ప్రజలను కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.



తాడిపత్రిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలకు సీఎం 'చేయూత'



వైఎస్సార్ చేయూత మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి, ప్రజాప్రతినిధులు

అనంతపురం అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు చేయూత అందిస్తున్నారని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. అనకాపల్లి జిల్లా కశింపేట మండలం పిసినికాడలో గురువారం ఏర్పాటు చేసిన 'వైఎస్సార్ చేయూత' నాల్గో విడత రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొని కంప్యూటర్ బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత పాల్గొన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారన్నారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు 'వైఎస్సార్ చేయూత' పథకం కింద ఏటా రూ.18,750 అందిస్తున్నారన్నారు. నాల్గో విడత కింద జిల్లాలో 1,20,347 మంది మహిళలకు రూ.225.652 కోట్లు విడుదల చేశారన్నారు. లబ్ధిదారుల్లో ఎస్సీలు 23,337 మంది, ఎస్టీలు 4,457 మంది, బీసీలు 90,746 మంది, ముస్లిం మైనారిటీలు 1,641 మంది, క్రిస్టియన్ మైనారిటీ మహిళలు 166 మంది ఉన్నారని చెప్పారు.

నాలుగు విడతల్లో రూ.855.339 కోట్ల లబ్ధి..

నాలుగేళ్లలో ఒక్కో మహిళకు రూ.75 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించిందని కలెక్టర్ గౌతమి తెలిపారు. 2020–21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకూ మొత్తం 4,56,180 మంది మహిళలకు రూ.855.339 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో 1,18,881 మంది మహిళలకు రూ.222.902 కోట్లు, 2021–22లో 1,00,070 మంది మహిళలకు రూ.187.631 కోట్లు, 2022–23లో 1,16,882 మందికి రూ.219.154 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,20,347 మందికి రూ.225.652 కోట్ల ఆర్థిక సాయం అందిందన్నారు. వారిలో 88,758 మంది ఎస్సీ మహిళలు, 16,246 మంది ఎస్టీ మహిళలు, 3,18,222 మంది బీసీ మహిళలు, 32,282 మంది మైనారిటీ మహిళలు, 473 మంది క్రిష్టియన్ మైనారిటీ మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మెగా చెక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రివాసుల కల సాకారం

- వంద పడకల ఆస్పత్రితో 3 జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- సీఎం వైఎస్ జగన్ చొరవతో అభివృద్ధిని పరుగులు పెట్టించాం
- జేసీ బ్రదర్స్ వంటి నియంతల నుంచి ప్రజలను రక్షించాం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- అట్టహాసంగా ఆస్పత్రి ప్రారంభోత్సవం



వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి. చిత్రంలో పైలా నరసింహయ్య తదితరులు

తాడిపత్రిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తాడిపత్రివాసుల 30 ఏళ్ల కలను సాకారం చేశామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. పట్టణంలో రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం గురువారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి వరకూ నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జై జగన్ నినాదాలతో మార్మోగించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

రిబ్బన్ కట్ చేసి వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం రోగులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడారు. ఇకపై ఈ ప్రాంతంలోనే మెరుగైన వైద్యం అందుతుందని భరోసా కల్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాడిపత్రి ప్రజల కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన ఆస్పత్రి పనులు పూర్తి చేశామన్నారు. వంద పడకల ఆస్పత్రి ప్రారంభంతో 3 జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. తాడిపత్రి ప్రాంతం అభివృద్ధి జరుగుతుంటే జేసీ దివాకర్ రెడ్డి, ఆయన సోదరుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఓర్చుకోలేరని ఎమ్మెల్యే విమర్శించారు. వంద పడకల ఆసుపత్రి పనులను అడ్డుకునే ప్రయత్నం చేసిన నీచులు అని దుయ్యబట్టారు. గతంలో ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరైనా జేసీ బ్రదర్స్ పట్టించుకోలేదన్నారు. ఇక్కడి ప్రజలు అభివృద్ధి చెందితే ఎక్కడ తమ మాట వినరన్న భయంతో బానిసలుగా చేసుకుని, నియంతల్లా పాలన సాగించారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను పెంచి పోషించి పైశాచిక ఆనందం పొందారన్నారు. ఇప్పటికీ జేసీ ప్రభాకర్ రెడ్డి అమాయకులను రెచ్చ గొడుతూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. పెద్దవడుగూరు మండలం అప్పెచెర్లలో తన మాటకు ఎదురుచెప్పారని, ఒకరి ఇంటిని కూల్చి వేయించిన దుర్మార్గుడన్నారు. వారం రోజుల క్రితం పెన్నానదిలో పైపులైన్ పనులు చేయిస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఇక్కడి పరిస్థితులు వివరిస్తే, నేను మద్దతుగా ఉంటా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం, ప్రజలకు సంక్షేమం అందిద్దాం అని ఆయన భరోసా కల్పించారని గుర్తు చేశారు. జేసీ బ్రదర్స్ నియంత పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని చెప్పారు. ఓటర్లు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా మారలేదని, మరోసారి వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మహిళా రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, సీనియర్ నాయకులు కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి, ఫయాజ్‌బాషా, పట్టణ అధ్యక్షుడు కంచం రామ్మోహన్‌రెడ్డి, నాయకులు జిలాన్‌బాషా, అయూబ్, డీవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవాస్తవాలు నమ్మకండి



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి రూరల్: టీడీపీ, జనసేన నాయకులు వ్యాప్తి చేస్తున్న అవాస్తవాలు నమ్మి మోసపో వద్దని ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. తాడిపత్రిలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభం సందర్భంగా గురువారం దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డితో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాడిపత్రిలో రూ.24 కోట్లతో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి మూడు దశాబ్దాల కలను సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. 30 పడకల నుంచి వంద పడకల ఆస్పత్రిగా పెంచడం వెనుక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కృషిని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సృజనాత్మకతతోనే నైపుణ్యత పెంపు



విద్యార్థులను అభినందిస్తున్న విశాల ఫెర్రర్

అనంతపురం: సృజనాత్మకతతోనే నైపుణ్యత పెంపొందుతుందని ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాలఫెర్రర్ అన్నారు. ఆర్డీటీ కార్యాలయంలో గురువారం సెంట్రల్ లెవల్ క్విజ్ ఫెస్ట్–2024ను నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫెస్ట్‌కు విశేషంగా హాజరైన విద్యార్థులను చూసి ఆనందంగా ఉందన్నారు. క్విజ్ ఫెస్ట్‌లో మొదటి బహుమతి పొందిన ముదిగుబ్బ ప్రాంతానికి చెందిన వి. లావణ్య, బి. నాని, జి.సుకుమార్, జి. నవ్యశ్రీను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహనమురళీ పాల్గొన్నారు.

పాహి పాహి పరమేశ్వరా!

నేడు మహాశివరాత్రి
జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాల్లో ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు

సాంబశివ... శంభోశంకర శరణం
మే తవ చరణయుగం
శివాయ నమహో౹ నమహో..
ఓం నమ శివాయః

.... అంటూ స్మరించగానే సకల అభీష్టాలు నెరవేరుతాయని ప్రతీతి. శివలింగంపై కాసిన్ని నీళ్లు పోస్తే సంతోషించి సర్వైశ్వర్యాలను ప్రసాదిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. అంత గొప్ప విశిష్టత కలిగిన శివలింగం ఆవిర్భవించిన మాఘమాసం కృష్ణ పక్ష చతుర్దశి రోజున మహాశివరాత్రి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మార్మోగుతోన్న శివనామస్మరణ



అనంతపురం కల్చరల్: సుందరంగా ముస్తాబైన మొదటి రోడ్డులోని శివాలయం



అనంతపురం కల్చరల్: నగరంలో పూజలందుకుంటున్న అనంతేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డులో వెలసిన కాశీవిశ్వేశ్వరాలయం, పాతూరులోని అతి ప్రాచీనమైన విరూపాక్షేశ్వరాలయం, నగరశివారులోని శివకోటి, అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయం, మారుతీనగర్‌లోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం, తపోవనంలోని జగదీశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపకాంతులతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. శివబాలయోగి ఆశ్రమంలో 121 మట్టి లింగాలను ఇచ్చి భక్తులతోనే పూజలు చేయించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తెలిపారు. టీటీడీ ధర్మప్రచారమండలి ఆధ్వర్యంలో రామచంద్రానగర్‌లోని టీటీడీ కల్యాణ మంటపంలో జాగరణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు శ్రీపాద వేణు పర్యవేక్షిస్తున్నారు. 108 పాదరస శివలింగాలను లాటరీ పద్ధతిలో భక్తులకు అందించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అలాగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవి శంకర్ గురూజీ భక్తబృందం ప్రత్యేకంగా ఉత్సవాల నిర్వహనకు ఏర్పాట్లు చేసింది.

బుగ్గ సంగమేశ్వర ఆలయంలో..

గుంతకల్లు రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో మూడు రోజుల పాటు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. శుక్రవారం ఉదయం ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పూర్తి చేశారు. శుక్రవారం వేకువ జాము 4 గంటల నుంచి కలశ స్థాపన, నవగ్రహ పూజలు, విశేష అభిషేకాలు ఉంటాయి. రాత్రి 12 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. శనివారం ఉదయం అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 10వ తేదీ ఉదయం 6 గంటలకు వసంతోత్సవంతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ మూడు రోజుల పాటు ఆలయంలో నిరంతరాయ అన్నదానం ఉంటుంది.



గుంతకల్లు రూరల్: ముస్తాబైన బుగ్గ సంగమేశ్వర ఆలయం

నాలుగు జాముల అభిషేకాలు



తాడిపత్రి అర్బన్: నరమృగ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి అర్బన్: ప్రాచీన సుప్రసిద్ధ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నేడు మహా శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. దర్శనానికి వచ్చే శివ మాలధారులు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను గురువారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోలిశెట్టి ఆంజనేయులు, సభ్యులు, ప్రధాన అర్చకులు పరిశీలించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుగ్గ రామలింగేశ్వరస్వామికి శుక్రవారం నాలుగు జాముల అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కాగా, శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నరమృగ వాహనంపై ఆదిదంపతులు భక్తులకు కనువిందు చేశారు. అంతకు ముందు ఆలయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై ఊరేగించారు.

రూ.2.30 కోట్లతో పెన్నహోబిలం రథం నిర్మాణం



నూతన రథం నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయ నూతన రథ నిర్మాణ పనులను గురువారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఆలయ ఈఓ విజయ్ కుమార్, అర్చకులు ద్వారాకానాథచార్యులు, బాలాజీ స్వామి, కాంట్రాక్టర్ గౌతం రెడ్డి, పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ... భక్తులు, దాతల సహకారంతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నూతన రథ నిర్మాణం చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. పాత రథం కూలిపోయిన సమయంలో ఎంతో మంది రాజకీయాలు చేయడానికి సిద్ధమయ్యారన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.30 కోట్లను మంజూరు చేసిందన్నారు. దీనికి భక్తుల విరాళాలు రూ.కోటి కలిపి మొత్తం రూ.2.30 కోట్లతో నూతన రథం నిర్మాణం చేపట్టారన్నారు. దీని వెనుక ఆలయ ఈఓ విజయ్‌కుమార్ చూపిన చొరవను కొనియాడారు. 37 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు, ఆరు చక్రాలతో కూడిన రథం నిర్మాణంలో నాణ్యమైన టేకును ఉపయోగిస్తున్నట్లు ఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. ఏడాది లోపు పనులు పూర్తి చేసి, ఉత్సవాలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ రెడ్డి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, ఆమిద్యాల సర్పంచ్ శ్రీరాములు, ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఊరట

తాడిపత్రి అర్బన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తాడిపత్రి కోర్టులో ఊరట లభించింది. 2019, జనవరి 25న అప్పటి వైఎస్సార్‌సీపీ సమన్వకర్త హోదాలో ఆయన యాడికి పోలీస్‌స్టేషన్ ఎదుట దర్నా చేశారు. దీంతో పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ పెద్దారెడ్డితో పాటు నాయకులు పైలా నరసింహయ్య, మరికొందరిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు లేనందున కేసును కొట్టివేస్తూ గురువారం తాడిపత్రి జేఎఫ్‌సీఎం చంద్రశేఖర్‌రెడ్డి తీర్పు వెలువరించారు. ఈ మేరకు న్యాయవాది నామాల విజయభాస్కరరెడ్డి తెలిపారు.

జాతీయ పోలీసు క్రీడా పోటీల్లో సత్తా

అనంతపురం: జాతీయ పోలీసు క్రీడా పోటీల్లో కానిస్టేబుల్ దీప సత్తా చాటారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో గత నెల 26 నుంచి మార్చి 2 వరకు 72వ జాతీయ పోలీసు క్రీడా పోటీలు జరిగాయి. అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ దీప ఇందులో పాల్గొన్నారు. విశాఖపట్నం 'దిశా' పోలీసు స్టేషన్ సీఐ కల్యాణితో కలిసి రిథమిక్ పెయిర్ యోగాసనాల విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ రూ.2 లక్షల నగదు రివార్డు, రెండు ఇంక్రిమెంట్లు ప్రకటించింది. ఈ క్రమంలో గురువారం ఆమెను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. లక్ష్మీ నారాయణ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ తదితరుల పాల్గొన్నారు.



కానిస్టేబుల్ దీపను అభినందిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ఎమ్మెస్సీ ఫలితాల విడుదల

అనంతపురం: ఎమ్మెస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఎమ్మెస్సీ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి

• మహిళ దినోత్సవం వేడుకల్లో కలెక్టర్ గౌతమి



కలెక్టర్ గౌతమిని సన్మానిస్తున్న ఏపీజేఏసీ అమరావతి మహిళ విభాగం నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ మహిళలు అన్నిరంగాల్లో ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ గౌతమి ఆకాంక్షించారు. ముఖ్యంగా బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఏపీ జేఏసీ అమరావతి మహిళ విభాగం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఏసీ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ సురేఖరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రతి మహిళా బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. ఓ వైపు ఉద్యోగం, వ్యాపారం చేస్తూ మరో వైపు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారన్నారు. ఓ మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆడపిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలన్నారు. బాల్యవివాహాల నివారణను సామాజిక బాధ్యతగా మహిళ అధికారులు తీసుకుని కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కలెక్టర్‌కు వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి అందజేసి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, మెప్మా పీడీ విజయలక్ష్మి, బీసీ సంక్షేమాధికారి కుష్బూకొఠారి, డీఎల్‌డీఓ ఓబులమ్మ, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, ఏపీ జేఏసీ అమరావతి మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి కృష్ణజ్యోతి, కోశాధికారి నీరజాక్షి, జేఏసీ జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

'అనంత' చీనీ మార్కెట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



చీనీమార్కెట్ కవర్‌షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

• ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మార్కెట్ యార్డులో ఉన్న చీనీ మార్కెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం చాలా ఆనందంగా ఉందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో చీనీ రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ రూ.2.10 కోట్లతో నిర్మించిన నూతన కవర్‌షెడ్‌ను గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా అందజేసిన రాయితీలు, ప్రోత్సాహంతో పండ్లతోటల విప్లవం కొనసాగిందన్నారు. జిల్లా నలుమూలలా వివిధ రకాల పండ్లతోటలు పెద్దఎత్తున విస్తరించడంతో 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ'గా అనంత ఖ్యాతి పొందిందని గుర్తు చేశారు. దీంతో ఇక్కడి రైతులు ఇబ్బంది పడకుండా 2006లోనే మార్కెట్ యార్డులో చీనీ క్రయ విక్రయాలు మొదలయ్యాయన్నారు. ఆ తర్వాత 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మౌలిక వసతులు సమకూరుతూ వచ్చాయన్నారు. ఏటా రూ.200 కోట్ల విలువ చేసే లక్ష టన్నుల వరకు చీనీకాయలు రాజస్తాన్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. మున్ముందు కోల్డ్‌స్టోరేజీలు, ఓపెన్‌షెడ్లు, రైపెనింగ్ ఛాంబర్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి, డైరెక్టర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నార్పల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ప్రకృతి వ్యవసాయం భేష్



ఎద్దులపల్లిలో రైతుల పండ్లతోటను పరిశీలిస్తున్న ఈజిప్ట్, యూరప్ ప్రతినిధులు

పామిడి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం అమలు బాగుందని ఈజిప్ట్, యూరప్ దేశాల ప్రతినిధుల బృందం కితాబునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) ప్రాజెక్టు ద్వారా అవులవుతున్న కార్యక్రమాలను పరిశీలించేందుకు విచ్చేసిన బృంద సభ్యులు గురువారం పామిడి మండలం ఎద్దులపల్లిలో పర్యటించింది. రైతు శ్రీనివాసరెడ్డి ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో సాగు చేస్తున్న చీని, నిమ్మ, మునగ తదితర పంటలను బృంద సభ్యులు వాల్టర్ లింక్, లూసీ వాలెస్, మెల్లిసా, హెల్మీ అబౌలీష్, అమర్ సహీబి, జస్టస్ హీని, అబౌలీస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అధిక లాభాలను ఆర్జించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతోందన్నారు. తమ దేశాల్లోనూ ఇక్కడి టెక్నాలజీని వినియోగిస్తామన్నారు. అనంతరం పామిడిలోని జ్యోతి మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో జిల్లా పాయింట్ పర్సన్, రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లతో పాటు వారు సమావేశమయ్యారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ కేడర్ వన్నూరమ్మ మాట్లాడారు. ఆరోగ్యరీత్యా అందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ అధికారి లక్ష్మానాయక్, థిమాటిక్ లీడ్‌లు సుధాకర్, సురేష్, ప్రవీణ్, సందీప్, అధికారులు స్మిత, స్వాతి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య, రిసోర్స్ పర్సన్ నరేంద్ర, ఎన్‌ఎఫ్ఏ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాయపల్లి ఘటనపై స్పందించిన పోలీసులు

రాప్తాడు: ప్రసన్నాయపల్లిలో బుధవారం రాత్రి జరిగిన ఘటనపై జైభీం పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై రాప్తాడు పోలీసులు తక్షణమే స్పందించి, పలువురిపై కేసు నమోదు చేశారు. గురువారం అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... జైభీం నాయకులు అందజేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు... తహసీల్దార్ మునివేలును సంప్రదించారన్నారు. ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 123–2బిలోని భూమి తనదేనంటూ చిన్మయనగర్‌కు చెందిన ఉప్పర శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడని, ఆయన ఫిర్యాదు మేరకు రికార్డులను పరిశీలించగా ఆ భూమి ప్రభుత్వ భూమిగా వెల్లడైనట్లుగా తహసీల్దార్ స్పష్టం చేశారన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఉప్పర శ్రీనివాసులు కుమారుడు ప్రేమ్‌కుమార్, ఇందిరమ్మ కాలనీకి చెందిన బోయ రామాంజినేయులు మరి కొందరు కలసి ఆ భూమిలో జై భీం పార్టీ నాయకులు వేసుకున్న గుడిసెలకు నిప్పు పెట్టారన్నారు. అడ్డగించబోయిన వారిని కులం పేరుతో దూషిస్తూ దాడికి తెగబడ్డారన్నారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ వివరించారు.

అనంతపురము జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్.,

సుభాష్ రోడ్, అనంతపురము. e-mail: adccbankatp@gmail.com

లాకరు ఖాతాదారులకు విజ్ఞప్తి

ఇందుమూలంగా అనంతపురం జిల్లా కేంద్రసహకార బ్యాంకు లిమిటెడ్ లాకరు ఖాతాదారులకు తెలియచేయడమేమనగా చాలా మంది ఖాతాదారులు మా బ్యాంకు నందు లాకర్లు కలిగి ఉండి తమ లాకరు లావాదేవీలను గత 20 సంవత్సరాలుగా జరపక మరియు అద్దె చెల్లించకుండా ఉన్నారు. ప్రస్తుతమున్న RBI మార్గదర్శకాల మేరకు ప్రతి యొక్క లాకరు ఖాతాదారుడు తమకు లాకరు ఉన్న బ్రాంచ్ యందు నవీకరించబడిన లాకరు అగ్రిమెంటును కేవైసీ తో పాటుగా సమర్పించవలెను. లేనిచో సదరు లాకరు యొక్క లావాదేవీలు నిలిపివేయబడును. అంతేకాక 10 సంవత్సరాలు పైబడి లాకరు లావాదేవీలు జరపక మరియు అద్దె చెల్లింపని లాకర్లను నిర్బంధంగా తెరిపించుటకు బ్యాంకుకు అధికారం కలదు.కావున సదరు లాకరుఖాతాదారుల లాకర్లను తెరిపించుటకు బ్యాంకు వారు తీర్మానించారు.

లాకరు ఖాతాదారుల వివరాలకు బ్యాంకు యొక్క వెబ్సైట్ (www.anantapurdccb.com) ను చూడవలసినదిగా మనవి. కావున పైన తెలిపిన లాకరు ఖాతాదారులు కానీ సంబంధితవారసులు కానీ ఎవరైనా ఏదైనా అభ్యంతరాలు ఉన్న ఎడల ఈ ప్రకటన వెలుబడిన 15 రోజులలో బ్యాంకువారిని సంప్రదించవలసినదిగా కోరుచున్నాము.లేనిచో బ్యాంకు వారు ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించి లాకర్లను RBI మార్గదర్శకాల మేరకు నిర్బంధంగా తెరిపించెదరని తెలియజేయడమైనది.

ఇట్లు : యాజమాన్యం, అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్

రాయదుర్గం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం. 31/2020/A1 | తేది : 07-03-2024

బహిరంగ వేలము ప్రకటన

రాయదుర్గం పురపాలక సంఘమునకు చెందిన దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్ మరియు జంతు వధశాలను (కబేల) తేది : 01-04-2024 నుండి 31-03-2025 తేదీ వరకు 12 నెలల కాలమునకు గుత్తలు (గేట్) వసూలు చేసుకొనుటకు లీజుకు ఇచ్చుటకు తేది 11-03-2024 ఉదయం 11-00 గంటలకు మునిసిపల్ కార్యాలయము ఆవరణము నందు బహిరంగ వేలము జరుపబడును మరియు అసెంబ్లీ / పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా బహిరంగ వేలం నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింది విధముగా ధరావత్తు మరియు సాల్వేన్సీ సొమ్మును ఆఫీసు నందు చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

వ. నెం	గుత్త వివరములు	వేలం సమయమున ముందుగా చెల్లించ వలసిన ధరావత్తు	వేలమునకు ముందుగా హాజరు పరచవలసిన మొదలితి (సాల్వేన్సీ సర్టిఫికెట్) సర్టిఫికెట్ విలువ
1	దినసరి కాయగూరల మార్కెట్‌లో గల మార్జిన్‌లలో మరియు రోడ్డు మార్జిన్ లందు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కు	రూ. 1,50,000/-	రూ. 3,00,000/-
2	వారపు సంత మార్కెట్ లలోను మరియు రోడ్డు మార్జిన్ లందు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కు	రూ. 50,000/-	రూ. 1,50,000/-
3	మేకలు, గొర్రెలు జంతు వధశాల లలో రుసుము వసూలు చేసుకొనుటకు హక్కు	రూ. 20,000/-	రూ. 1,00,000/-

మిగిలిన వివరములు కార్యాలయము పనివేళలలో తెలుసుకొనవలెను.

సం/– కమిషనరు, రాయదుర్గం పురపాలక సంఘము

క్లుప్తంగా

శ్రీశైలం మల్లికార్జునుడికి నాట్య నీరాజనం



చిన్నారిని అభినందిస్తున్న శ్రీశైలం ఆలయ కమిటీ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: శ్రీశైలం బ్రహ్మోత్స వాల్లో నగరానికి చెందిన అరవింద నృత్య శిక్ష ణాలయం చిన్నారులు అద్భుత ప్రదర్శనతో మెప్పించారు. శైవభక్తిగీతాలపై శాస్త్రీయ నృత్యాలతో మల్లికార్జున భ్రమరాంబ దంపతు లకు నీరాజనాలర్పించిన చిన్నారులు, నాట్యా చార్యులను ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ, పాలక మండలి సభ్యులు ఘనంగా సత్కరిం చారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాప త్రాలు అందజేశారు.

మానవహితమైన ఔషధాల లభ్యతపై పరిశోధనలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జీవీఆర్ శ్రీనివాసరావు

అనంతపురం: మానవ హితమైన ఔషధాల లభ్యతపై విస్తృత పరిశోధనలు కొనసాగాలని జేఎన్‌టీయూఏ వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. జేఎన్‌టీయూఏ అనుబంధ ఓటీపీఆర్ఐలో గురువారం ఫార్మా–డీ విద్యార్థుల స్వాగతోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా–డీ కోర్సుకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల ఉన్నతికి కారణమైన గురువులను ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.శంకర్ రెడ్డి, ఫార్మా–డీ విభాగాధిపతి డాక్టర్ ఈ.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సదస్సులో సత్తా చాటారు. ఈ నెల 6న ఎస్వీఐటీ కళాశాలలో జరిగిన సాంకేతిక జాతీయ సదస్సులో ప్రతిభ చాటి మొదటి బహుమతి దక్కించుకున్నారు. ఎస్.బాబాఫక్రుద్దీన్, వై. అఫ్రీసాభాను, రిజ్వానా, ఇస్మాయిల్ ప్రదర్శించిన లైవ్ ప్రాజెక్ట్‌కు మొదటి బహుమతి దక్కింది. అలాగే పిక్ అండ్ స్పీక్ అంశంలో మరో విద్యార్థి ఎస్.సిద్ధిక్ మూడో స్థానం దక్కించుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఆంజినేయులు అభినందించారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా గ్రామాల అభివృద్ధి





కనగానపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో సమన్వయకర్త శాంతమ్మ, ఆత్మకూరు వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: గతంలో మాదిరిగా ఫ్యాక్షన్ హత్యలు, ఘర్షణకు దూరంగా గ్రామాలను అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తగరకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మతో కలిసి సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో గతంలో జరిగిన ఫ్యాక్షన్ ఘర్షణల వల్ల ఎంతో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకొన్నారన్నారు. ఇక్కడ పరిటాల కుటుంబ సభ్యులు ఆర్థికంగా, రాజకీయంగా బలపడేందుకు ఎంతో మంది బీసీ, ఎస్సీ వర్గాల ప్రజలను బలిపశువులను చేశారని మండిపడ్డారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎక్కడా గొడవలకు తావులేకుండా ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ఇందుకు ప్రధాన కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలే అని తెలిపారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. నియోజకవర్గంలోని రైతన్నల కోసం సాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చి, ఈ ప్రాంతాన్ని పచ్చని పొలాలతో సస్యశామలం చేశామన్నారు. గత 25 ఏళ్లలో ఎప్పుడు జరగని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి వైపు నడిపిస్తున్నామన్నారు. సమన్వయకర్త శాంతమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉన్నారన్నారు. ఇలాగే ప్రభుత్వం పది కాలాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెలు, మేకల ఫెడరేషన్ అధ్యక్షుడు నరసింహాగౌడ్, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతి పాల్గొన్నారు.

రూ.117 కోట్లతో నీటి సమస్య పరిష్కారం

ఆత్మకూరు: దశాబ్దాలుగా పరిటాల కుటుంబం అధికారంలో ఉన్నా అభివృద్ధి చేసిందేమీ లేదు. ఎన్నికల సమయంలో ప్రజలకు నీటి సమస్య పరిష్కరిస్తా అని మాటిచ్చా.. ఇచ్చిన మాట ప్రకారమే రూ.117 కోట్లతో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆత్మకూరు సమీపంలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మతో కలిసి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో కనగానపల్లి మండలంలోని 27 గ్రామాలు, రామగిరి మండలంలోని 27 గ్రామాలు, ఆత్మకూరు మండలంలోని 26 గ్రామాలు, అనంతపురం రూరల్ మండలంలోని 31 గ్రామాలకు గాను జలజీవన్ మిషన్ పథకం ద్వారా నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి అనంతపురం రూరల్ మండలంలోని పాపంపేట వరకు దాదాపు 48 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులతో పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 37 కిలోమీటర్ల పనులు పూర్తి అయినట్లు తెలిపారు. ప్రజలకు మంచి చేస్తుంటే పరిటాల సునీతకు సంబంధించిన కాంట్రాక్టర్లు టెండరు వేసి ఓ ఐదు కిలోమీటర్ల పనులు తీసుకున్నారని తెలిపారు. ఈ 42 కిలోమీటర్లలో ఈ చివరి ఐదు కిలోమీటర్లు అనంతపురం రూరల్ మండలానికి మంచి నీరు తీసుకెళ్తుంటే అడ్డుకోవడం మంచిది కాదన్నారు. ఈ మధ్య పరిటాల సునీత మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 35 రోడ్లు మేము తీసుకున్నాం, మేము పనులు చేస్తాం అని చెప్పి ఇప్పటి వరకు పనులు కూడా ప్రారంభించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, వైస్ ఎంపీపీ విజయ్, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, మల్లన్న, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, నాగరాజు, వెంకటేష్, బాలస్వామిరెడ్డి, రామాంజి, నరసింహ, సద్దికూటి శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తరుణ్, రాజు, వెంటక్రామిరెడ్డి, గోపాల్, మాధన్న, గోవింద్, నాగభూషణంరెడ్డి, తోపుదుర్తి ఎంపీటీసీ పోతులయ్య పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి

ఆత్మకూరు: రామాయణ రచయిత వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శప్రాయుడు. వాల్మీకికి అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరులో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ తదితరులు వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

రూ.2 వేల కోట్లతో సంక్షేమం



మహిళకు పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- 5 నెలలు ముందుగానే బ్రిడ్జ్ ఏర్పాటు చేశాం
- చిత్తశుద్ధి కల్గిన ప్రభుత్వం మాది
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 43వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం టవర్‌క్లాక్–పీటీసీ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు నిర్దేశిత సమయం కంటే ఐదు నెలలు ముందుగా ఏర్పాటు చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా, లక్షలాది మంది రాకపోకలు చేసేలా చర్యలు తీసుకున్నాం. వైఎస్సార్‌సీపీ అంటే చిత్తశుద్ధి కల్గిన ప్రభుత్వం. సంక్షేమం, అభివృద్ధిని పెద్ద ఎత్తున చేపట్టామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 43వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏకంగా రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమాన్ని అందించామన్నారు. 1965లో నిర్మించిన క్లాక్‌టవర్ బ్రిడ్జ్ నేషనల్ హైవే పరిధిలో ఉండేదన్నారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్అండ్‌బీ పరిధిలోకి మార్పించిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా టవర్‌క్లాక్ బ్రిడ్జ్‌ని విస్తరించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లోనే కనకదుర్గ ఫ్లైఓవర్‌ను గడ్కరీ ప్రారంభించారన్నారు. అదే సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించగా, అందుకు అంగీకరించారన్నారు. అందులో భాగంగానే రూ.311.93 కోట్లతో అర్బన్ ప్రాజెక్ట్ చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. టవర్‌క్లాక్ బ్రిడ్జ్ సహా 9.2 కిలోమీటర్ల పొడవున రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2021 అక్టోబర్ 25న మొదలైన పనులు నిర్దేశిత సమయం కంటే ముందస్తుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇంకా నగరంలో వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్లు, కాలువలు, అంతర్గత రోడ్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల మధ్య పథకాలకు ఎంపిక చేసే దౌర్భాగ్య పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు ఇసాక్, సాకే చంద్ర, బాలాంజినేయులు, రహంతుల్లా, టీవీ చంద్రమోహన్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్, సైఫుల్లా బేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ మెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ణ, జానీ, జావెద్, రాధాకృష్ణ, రామయ్య, సాకే కుళ్లాయస్వామి, అమర్‌నాథ్ రెడ్డి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారం సిగ్గుచేటు

- పైప్‌లైన్ ఏర్పాటుకు డబ్బులు వసూలు చేస్తున్నారని తప్పుడు కథనాలు
- ఎమ్మెల్యే అనంతతోనే రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు నారాయణమ్మ

అనంతపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రుద్రంపేట పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతోనే పంచాయతీలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రుద్రంపేట ఎంపీటీసీ–3 సభ్యురాలు నారాయణమ్మ అన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేని ఎల్లో మీడియా దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టేలా కథనాలు రాయడం సిగ్గుమాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలోని పంతులకాలనీ, చంద్రబాబు నగర్‌లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు పనులు జరుగుతున్నాయని తెలిపారు. అక్కడ అభివృద్ధి పనులు జరిగితే టీడీపీ నాయకులకు మనుగడ ఉండదన్న ఉద్దేశంతో ఎల్లో మీడియా కొంతమంది వ్యక్తులు తప్పుడు ప్రచారాలకు తెరలేపారని మండిపడ్డారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్న క్రమంలో కొన్ని చోట్ల తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినడంతో పంచాయతీ కార్మికులు పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతురని పేర్కొన్నారు. అయితే ఎల్లో మీడియా మాత్రం పైప్‌లైన్ మరమ్మతులకు ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణమన్నారు. ఎల్లో మీడియా తప్పుడు కథనాలకు వత్తాసు పలుకుతూ కొంతమంది అభివృద్ధి పనులకు అడ్డతగులుతున్నారని చెప్పారు.

కుక్కల బెడద తగ్గిస్తున్నాం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని కుక్కల బెడదను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం కంపోస్టు యార్డు వద్ద కుక్కల ఆపరేషన్ చేయడానికి ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కేంద్రాన్ని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలసి పరిశీలించారు. జనవరిలో 1474, ఫిబ్రవరిలో 1468, మార్చి 5వ తేదీ వరకు 363 కుక్కలకు వెటర్నరీ వైద్యులు ఆపరేషన్లు చేశారన్నారు. టెండర్‌లో నమోదు చేసిన ప్రకారమే కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లిస్తామని, ఎక్కడా అక్రమాలకు అవకాశం ఉండదన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు అబూసలేహా, సైఫుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలపై టీడీపీది కపట ప్రేమ

అనంతపురం కల్చరల్: టీడీపీ ముందు నుంచి మైనార్టీలను మోసం చేస్తూ వస్తోంది. మాటలకే పరిమితమై తీరా ఎన్నికల వేళ ఎదగకుండా అణచివేస్తోందని పలువురు మైనార్టీ నాయకులు టీడీపీ వైఖరిని తప్పుబట్టారు. మైనార్టీ ప్రజాసంఘాల వారు ఐఎంఎం మహబూబ్ బాషా నేతృత్వంలో గురువారం నగరంలోని పలు మసీదుల వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల్లో వైఎస్సార్‌సీపీ మైనార్టీలకు 7 సీట్లు కేటాయించగా టీడీపీ కేవలం ఒక్కరికి మాత్రమే సీటు ఇవ్వడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు ముస్లింలపై కపట ప్రేమ చూపిస్తున్నారని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడల్లా అరచేతిలో స్వర్గం చూపిస్తూ ఇంకా మోసం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. మైనార్టీల సత్తా ఏమిటో రానున్న ఎన్నికల్లో టీడీపీకి చూపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు షబ్బీర్, మైనార్టీ నాయకులు జాకీర్, వన్నూర్ బాషా, తాజ్, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

అనంతపురం క్రైం: కూడేరు మండలం అరవకూరు, కమ్మూరు గ్రామాల మీదుగా నగరానికి బస్సు సర్వీసు కల్పించాలని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజులకు కమ్మూరు సర్పంచ్ చిన్న రంగారెడ్డి వినతిపత్రం అందజేశారు. స్పందించిన జోనల్ చైర్‌పర్సన్ మంజుల గ్రామాలకు సర్వీసు నడిపేలా అధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు.

యథాస్థితికి నీటి సరఫరా



పీఏబీఆర్ డ్యాంలో మోటర్‌ను పరిశీలిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఏర్పడి నీటి సరఫరా జాప్యానికి తెరపడింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ, మేయర్ వసీం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ ముందస్తు చర్యలతో నీటి సరఫరా యథాస్థితికి చేరింది. బుధవారం అర్ధరాత్రి పీఏబీఆర్ డ్యాంలో మూడో మోటర్‌ను నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, పంపింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం మొత్తం మూడు మోటర్ల ద్వారా నిరంతరంగా పంపింగ్ జరుగుతోంది. పీఏబీఆర్ డ్యాంలో ఉన్నఫలంగా మోటర్లు కాలిపోవడంతో నీటి సమస్య ఏర్పడ్డ విషయం విదితమే. ప్రస్తుతం ముద్దలాపురం ఫిల్ట్రేషన్ పాయింట్ నుంచి 49 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతోంది.

డ్యాంను పరిశీలించిన మేయర్, కమిషనర్

మూడో మోటర్‌ను బిగించి, పంపింగ్ మొదలవడంతో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ మేఘ స్వరూప్ గురువారం పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని చెప్పామన్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా మూడు రోజుల ముందుగానే నీటి సరఫరా పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో 760 హెచ్‌పీ మోటర్, రూ.50 లక్షలతో స్టాండ్‌బై మోటర్‌ను అందుబాటులో తీసుకువచ్చి భవిష్యత్తులో నీటి సరఫరాకు ఎటువంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్,దుర్గాదేవి, అబూసలేహా, నాయకుల గంగాధర్, దాదు, తదితరులు పాల్గొన్నారు.

2,034 మంది మహిళలకు 'చేయూత'



మహిళలతో కలిసి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: మహిళలకు అండగా నిలుస్తూ.. ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎంపీపీ హేమలత పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో భాగంగా 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల్లోపు ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా 2,034 మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగనన్న మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందన్నారు. ఎంపీడీఓ దశరథరామయ్య, ఏపీఎం మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి సిద్ధం

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి, సింగంపల్లి తండా, వై.కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ఉంటుందని ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు తెలిపారు. గురువారం ఎంపీపీ చాంబర్‌లో వారు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వస్తున్నారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. పథకాల లబ్ధిని ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

అన్నే ఫెర్రర్ జీవితం ఆదర్శప్రాయం



అన్నె ఫెర్రర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అనంతకు మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవలందించిన ఆదర్శమూర్తి అన్నే ఫెర్రర్ అని అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్డీటీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అన్నే ఫెర్రర్‌ను అంధ విద్యార్థినులతో కలిసి తరిమెల రమణారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ సంస్థ సేవల పట్ల ఎంతో ఆకర్షితురాలై ప్రశంసించడం అమ్మ సంస్థకు మరింత బలాన్ని ఇచ్చిందన్నారు. ఫెర్రర్ సేవా బాటలోనే ఎంతో మంది సామాజిక సేవా కార్యకర్తలుగా మారారన్నారు. ఆర్డీటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఒక మహిళ ఎంతో సేవా భావంతో కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం అంధ విద్యార్థినులకు నూతన వస్త్రాలు, భోజన వసతి కల్పించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి ఇతర అధికారులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

అనంతపురం/అనంతపురం టవర్ క్లాక్/అనంతపురం మెడికల్/అనంతపురం క్రైం/అనంతపురం ఎడ్యుకేషన్: : నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ , జేఎన్‌టీయూ అనంతపురం ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో, బాలాజీ కళ్యాణ మంటపం, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, డీఎంహెచ్ఓ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవం జరుపుకున్నారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నగర శివారులోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమాల్లో వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అనంత వీధుల్లో శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: ప్రజాపతి బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. సిస్టర్ శారద నేతృత్వంలో ఉదయం పురవీధుల్లో నిలువెత్తు సోమనాథ లింగాన్ని శోభాయాత్రలో భక్తులకు దర్శనం కల్పించారు. పాతూరు నుంచి సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, గాంధీబజార్ మీదుగా చెరువుకట్ట వద్ద ఉన్న బ్రహ్మకుమారీల కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. సిస్టర్ శారద, సీనియర్ న్యాయవాది విఠల్ పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

అనంతపురం: నగరంలోని ఓ అటానమస్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతోందని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన తెలిపారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. వర్సిటీ డెవలప్‌మెంట్ ఫీజు పేరుతో యథేచ్ఛగా వసూలు చేస్తున్నా, చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు విఫలం అయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు రాజు నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వలంటీర్ మృతి

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వలంటీర్ ఈడిగ కళ్యాణి గురువారం ఉదయం అనంతపురం సర్వజన ఆస్పత్రిలో మృతి చెందింది. వివరాలు.. మండలంలోని హంపాపురం గ్రామానికి చెందిన వలంటీర్ ఈడిగ కళ్యాణి గత నెల 22న అనంతపురం నుంచి గ్రామానికి ఆటోలో వస్తుండగా రాత్రి 7 గంటల సమయంలో హంపాపురం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 5 మంది మందికి గాయాలు కాగా ఈడిగ కళ్యాణి తలకు తీవ్ర గాయం అయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళ్యాణి వైద్య చికిత్సలకు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.5 లక్షలు మంజూరు చేయించామన్నారు. దురదృష్టవశాత్తు మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ బోర్డు సభ్యుడు కేశవ రెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

రాప్తాడు: విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి. దేశ భవిష్యత్ విద్యార్థుల పైనే ఆధారపడి ఉందని ఎస్కేయూ ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మమత సూచించారు. గురువారం ఎస్వీఐటీ కళాశాలలో ప్రిన్సిపాల్ విష్ణువర్దన్ అధ్యక్షతన రెండు రోజుల పాటు సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు విజ్ఞానంతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కరస్పాండెంట్ వీబీఆర్.శర్మ, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.